బాధ్యత మరిచిన ప్రజాప్రతినిధులు

- ప్రజా సమస్యల పరిష్కారంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీల నిర్లక్ష్యం
- సర్వసభ్య సమావేశానికి వరుసగా రెండు రోజులు డుమ్మా
- కోరం లేక సమావేశం రద్దు
- ప్రజాప్రతినిధుల తీరుపై ఎంపీపీ ఆగ్రహం


సర్వసభ సమావేశానికి హాజరైన సర్పంచ్, ఎంపీటీసీ

హుజూర్‌నగర్‌రూరల్ : అకాల వర్షాలు కురిసి పంటలు దెబ్బతిని రైతులు అల్లాడుతుంటే హుజూర్‌నగర్ మండలంలోని ప్రజాప్రతినిధులు మాత్రం బాధ్యత మరిచి మండల సర్వసభ్య సమావేశానికి గైర్హాజరై ప్రజా సమస్యలను గాలికొదిలేశారు. ఎంపీడీఓ శాంతకుమారి ఎజెండా ఇచ్చినప్పటికి సమావేశానికి మండలంలో 11 మంది సర్పంచ్‌లకు గాను కరక్కాయలగూడెం సర్పంచ్ ఒక్కరు, ఏడుగురు ఎంపీటీసీలకు ఎంపీపీతో పాటు కరక్కాయలగూడెం ఎంపీటీసీ మాత్రమే హాజరయ్యారు. దీంతో సమావేశానికి హాజరు కాని వారిపై ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా మండలంలో ఎన్నో సమస్యలు వేళ్లూనుకొని ఉన్నప్పటికి తీర్మానం చేసి పరిష్కారం చేయాల్సిన ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి రెండు రోజులు డుమ్మా కొట్టారు. ఆదివారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో కోరం లేకపోవడంతో సోమవారానికి వాయిదా వేశారు. ఇక సోమవారం ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి కూడా ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు హాజరుకాలేదు. మండలంలో పంటలు దెబ్బతిని రైతులు, గ్రామాల్లో తిష్ట వేసిన సమస్యలతో ప్రజలు అల్లాడుతుంటే ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరించడపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి



ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు కృషిచేయాలి. ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు వరిపైరు నేలవాలడంతో రైతుల నానా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో వివిధ సమస్యలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వాటి పరిష్కారానికి సమావేశంలో తీర్మానించాల్సి ఉంది. కానీ ప్రజాప్రతినిధుల గైర్హాజరుతో సమావేశం జరగడం లేదు.

– గూడెపు శ్రీనివాస్, ఎంపీపీ

కోరం లేక.. నిర్వహించలేదు



మండల సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం కోరం లేకపోవడంతో సోమవారానికి వాయిదా వేశాం. సోమవారం నిర్వహించిన సమావేశానికి కూడా ప్రజాప్రతినిధులు గైర్హాజరు కావడంతో కోరం లేక సమావేశం నిర్వహించలేదు.

– శాంతకుమారి ఎంపీడీఓ

సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించొద్దు


హుజూర్‌నగర్ : ఆత్మీయ సమ్మేళన సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : ప్రజాప్రతినిధులు, నాయకులు నిత్యం ప్రజలలోనే ఉంటూ వారి సమస్యలను తీర్చడంలో ముందుండాలని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని కొండిన్య ఫంక్షన్ హాల్‌లో బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళన సన్నాహక సమావేశాన్ని పార్టీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు అమర్‌నాథ్ రెడ్డి, అమర్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించవద్దన్నారు. ప్రభుత్వం అమలుపరిచే ప్రతి పథకం అర్హులకు అందేలా చూడాలన్నారు. త్వరలో నిర్వహించబోయే ఆత్మీయ సమ్మేళన నిర్వహణ విధానంపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు ముడెం గోపిరెడ్డి, సీనియర్ నాయకులు అట్లూరి హరిబాబు, వై.పిచ్చయ్య, మహిళా అధ్యక్షురాలు దొంతిరెడ్డి పద్మ రాంరెడ్డి, ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాలకు మహర్దశ

మేళ్లచెరువు : బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాలకు మహర్దశ వచ్చిందని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వెంకట్రామాపురం గ్రామంలో సుమారు రూ. 60 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు నిర్మాణ పనులు, వైకుంఠ ధామం పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ కొట్టె పద్మసైదేశ్వర రావు, జెడ్పీటీసీ పద్మ గోవిందరెడ్డి, సర్పంచ్ కల్పన నాగిరెడ్డి తదితరులున్నారు.


మేళ్లచెరువు : అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

హుజూర్‌నగర్ : కంటి వెలుగు పథకాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. హుజూర్‌నగర్‌లోని ఒకటవ వార్డు దద్దనాల చెరువు కాలనీలో రెండవ విడత కంటి వెలుగు శిబిరాన్ని ఆయన సోమవారం ప్రారంభించి మాట్లాడారు. కంటి వెలుగు కార్యక్రమంలో వైద్యులు కళ్లను పరీక్షించి దృష్టి లోపం ఉన్న వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కె.శ్రీను, జె.శంభయ్య, క్యాంపు సూపర్‌వైజర్ ఐ.రామకృష్ణ, డాక్టర్ సుష్మ, సిబ్బంది మల్లిక, శివ, మాధవి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈటల రాజేందర్‌ను కలిసిన జిల్లా అధ్యక్షుడు భాగ్యరెడ్డి


ఎమ్మెల్యే ఈటలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు భాగ్యరెడ్డి, తదితరులు

హుజూర్‌నగర్ : హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డి సోమవారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఈటలకు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అంబళ్ల నరేష్, అధికార ప్రతినిధి విజయ్, సురేష్, నాయకులు పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

గరిడేపల్లి : మండల కేంద్రంలో మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక పార్టీ కార్యాలయంలో బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుగులోతు కృష్ణానాయక్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్ యువజన మండల అధ్యక్షుడు మండవ నాగేశ్వర్‌రావుగౌడ్, ప్రధాన కార్యదర్శి గాలి రామకృష్ణయాదవ్, ఉపాధ్యక్షులు ఉపేందర్‌రెడ్డి, శివభిక్షం తెలిపారు. సోమవారం స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే సైదిరెడ్డి, ఎంపీపీ పెండెం సుజాతాశ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ శైలజారవీందర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ప్రమీలావెంకటరమణారెడ్డి హాజరవుతున్నందున బీఆర్‌ఎస్ శ్రేణులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

ఘనంగా మాసకల్యాణం

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీ ఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం మాస కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయంలో స్వామివార్ల విగ్రహాలకు పూలతో, పట్టు పీతాంబ్రాలతో అందంగా అలంకరించారు. అనంతరం పుణ్యావచనం, పంచామృతాభిషేకాలు, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి విశేష అలంకరణ వంటి కార్యక్రమాలతో కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. అనంతరం ఆశీర్వచనాలు, తీర్థప్రసాద వినియోగం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కొంకపాక విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ, భక్తులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు, ఉద్యోగులు

కోదాడరూరల్ : కోదాడ మండల పరిషత్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న గల్ఫ్ సమరం ఐదు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో ఎంపీఓ, కార్యదర్శులు, సిబ్బంది రూ.50 వేల నగదును సేకరించి సోమవారం మృతుని కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీఓ తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ చిన్న వయస్సులో మృతిచెందడం బాధకరమని, వారి కుటుంబ సభ్యులకు తాము అండగా ఉంటామన్నారు.

28న కోదాడ బార్ అసోసియేషన్ ఎన్నికలు

కోదాడఅర్బన్ : కోదాడ బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి, న్యాయవాది రాజారాం సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. 20వ తేదీ నుంచి ఎన్నికల ప్రక్రియ మొదలైతుందని, 21న నామినేషన్ స్వీకరణ, 23న స్క్రూట్నీ జరుగుతుందని తెలిపారు. 24న విత్‌డ్రా ఉంటాయని, 28న ఉదయం 10 గంటల నుంచి పోలింగ్ ప్రారంభం అవుతుందని, మధ్యాహ్నం పోలింగ్ అనంతరం సాయంత్రం 3గంటలకు కౌంటింగ్, ఎన్నికల ఫలితాలు ప్రకటించడం జరుగుతుందని తెలిపారు.

ఠానూనాయక్ పోరాటం మరువలేనిది


ఠానూనాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గిరిజన నాయకులు

మఠంపల్లి : తెలంగాణాలో గిరిజనులకు భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం ఠానూనాయక్ చేసిన రైతాంగ సాయుధ పోరాటం మరువలేనిదని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాలోతు బాలునాయక్, రాష్ట్ర నాయకుడు భూక్యా పాండునాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గిరిజన సంఘం కార్యాలయంలో ఠానూనాయక్ 73వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు స్వామినాయక్, సురేష్‌నాయక్, శ్రీనునాయక్, రమీయా, కోటయ్య, తదితరులున్నారు.

ఎంపీ ఉత్తమ్‌పై అసత్య ప్రచారం తగదు


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు ప్రభాకర్‌రెడ్డి

హుజూర్‌నగర్ : అధికార పార్టీలో వలసలను ఆపుకునేందుకు టీపీసీసీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డిపై అసత్యప్రచారం చేయడం తగదని కాంగ్రెస్ నాయకుడు అల్లం ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ ఉత్తమ్ పార్టీ మారుతారని బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఎంపీ ఉత్తమ్ ఇక్కడ నుంచే పోటీ చేస్తారని, 50 వేల మెజార్టీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని దోపిడీ చేసిన బీఆర్‌ఎస్‌కు రాబోయే రోజుల్లో పుట్టగతులు ఉండవని విమర్శించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సాముల శివారెడ్డి, దొంగిరి వెంకటేశ్వర్లు, తన్నీరు మల్లికార్జున్‌రెడ్డి, అరుణ్ కుమార్, కౌన్సిలర్ శ్రవణ్ కుమార్, వీరారెడ్డి, సత్యనారాయణ, మల్లయ్య, యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా


రామలక్ష్మీపురంలో అన్నెం అంజిరెడ్డిని పరామర్శిస్తున్న శశిధర్‌రెడ్డి

కోదాడరూరల్ : ఆపదలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటానని ఆ పార్టీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని రామలక్ష్మీపురానికి చెందిన బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు అన్నెం పెద్ద అంజిరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో సోమవారం ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట బీక్యాతండా సర్పంచ్ బాణోతు అంబేద్కర్, మాజీ సర్పంచ్ బెల్లంకొండ బ్రహ్మం, వీరనాగిరెడ్డి, బొలిశెట్టి నాగేంద్రబాబు, అమరబోయిన నాగేశ్వరరావు, కొప్పుల రాంరెడ్డి, హుస్సేన్, శ్రీను, రామయ్య, సైదిరెడ్డి, వెంకట్‌రెడ్డి, రమేష్ ఉన్నారు.

ఇతర పథకాల్లో ప్రాధాన్యం ఇస్తాం : ఆర్డీఓ


ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ, డీఎస్పీ

కోదాడ : తమకు అర్హత ఉన్నా డబుల్ బెడ్ రూం ఇళ్లు రాలేదని పలువురు సోమవారం కోదాడ ఆర్డీఓ కార్యాలయం ముందు నిరసనకు దిగారు. దీంతో పోలీసులు ఆర్డీఓ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కిశోర్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డిలు నిరసనకారులతో మాట్లాడారు. వారి నుంచి వివరాలను తీసుకొని భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలలో ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు 560 మాత్రమేనని కానీ అర్హులు వేల మంది ఉండడంతో లాటరీ పద్ధతిలో పారదర్శకంగా ఎంపిక చేశామని అర్హులు దీనిని అర్థం చేసుకోవాలని కోరారు. అధికారులు చెప్పిన విషయాలు వినాలని, కాదని ఆందోళన చేస్తే కేసులు నమోదు చేయాల్సి వస్తుందని డీఎస్పీ హెచ్చరించారు. ఇదిలా ఉండగా అర్హులను ఎంపిక చేయడానికి సర్వే సిబ్బంది డబ్బులు డిమాండ్ చేశారని, కొంత మంది వద్ద డబ్బులు తీసుకొని అనర్హులను ఎంపిక చేశారని పలువురు ఆరోపించారు. దీనికి సంబంధించిన వీడియోలు కూడా తమ వద్ద ఉన్నాయని వారు తెలపడం గమనించదగ్గ విషయం.

న్యాక్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


కార్మికులకు మెటీరియల్ పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్‌లు

హుజూర్‌నగర్‌రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం కార్మిక శాఖ సహకారంతో అసంఘటిత రంగ కార్మికులకు నిర్వహిస్తున్న న్యాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్) శిక్షణను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి కోరారు. సోమవారం మండల పరిధిలోని లింగగిరి, శ్రీనివాసపురం గ్రామాల్లో శిక్షణ పూర్తిచేసుకున్న కార్మికులకు హ్యాండ్ బ్యాగ్, హెల్మెట్, ఇతర స్టేషనరీని ఆయా గ్రామాల సర్పంచ్‌లు పత్తి రమ్యనాగరాజు, కర్నాటి అంజిరెడ్డితో కలిసి పంపిణీ చేసి మాట్లాడారు. హుజూర్‌నగర్ పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే సైదిరెడ్డి కృషితోనే న్యాక్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. కార్మిక మండలిలో లేబర్ కార్డు ఉండి 18 నుంచి 45 సంవత్సరాల లోపు ఉన్న వారికి తాపీ, భవన నిర్మాణ, ప్లంబింగ్, ఎలక్ట్రికల్, పెయింటర్లకు 15 రోజుల శిక్షణను అందించడంతో పాటు శిక్షణ కాలంలో మధ్యాహ్న భోజనం, శిక్షణ పూర్తి చేసిన వారికి రాష్ట్ర ప్రభుత్వం రూ.4500 ఉపకార వేతనం, సర్టిఫికెట్ అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్‌లు గురవయ్య, రవి, శిక్షణ రిసోర్స్‌పర్సన్ సుదర్శన్, నమ్మియానాయక్, ఐలయ్య, దారాసింగ్, కరుణాకర్, వార్డు సభ్యులు, శిక్షణ కార్మికులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్లకు చేరిన 'పది' ప్రశ్నపత్రాలు


హుజూర్‌నగర్ : పోలీస్‌స్టేషన్‌కు చేరిన పదవ తరగతి పరీక్ష ప్రశ్నపత్రాలు

హుజూర్‌నగర్ : ఏప్రిల్ 3 నుంచి నిర్వహించనున్న పదవ తరగతి పరీక్షల పశ్నపత్రాలు సోమవారం హుజూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. జిల్లా కేంద్రమైన సూర్యాపేట నుంచి సెట్ వన్ పరీక్ష ప్రతాలు వచ్చినట్లు రూట్ ఆఫీసర్, ఎంఈఓ చత్రు నాయక్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ సైదానాయక్, కస్టోడియన్‌లు అనిల్‌కుమార్, కె.శ్రీనివాసరావు, సీ ఎస్, డీఓలు ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : ఏప్రిల్ 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరగనున్న 10వ తరగతి పరీక్షల ప్రశ్నపత్రాలు సోమవారం నేరేడుచర్ల పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాయి. ఈ సందర్భంగా మండల విద్యాధికారి చత్రునాయక్ మాట్లాడుతూ 10వ తరగతి ప్రశ్నపత్రాలను అన్ని జాగ్రత్తలతో కట్టుదిట్టంగా భద్రపరిచామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పదవ తరగతి పరీక్షల చీఫ్ సుపరింటెండెంట్‌లు ఎల్.శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్‌రావు, డిపార్ట్‌మెంట్ అధికారులు వై.వెంకటేశ్వర్లు, టి.వెంకటేశ్వర్లు, వీరనారాయణ తదితరులున్నారు.

మేళ్లచెరువు : ఏప్రిల్ 3 వ తేదీ నుంచి జరగబోయే పదవ తరగతి పరీక్ష పేపర్లు సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. ఈ సందర్భంగా రూట్ ఆఫీసర్ చత్రునాయక్ మాట్లాడుతూ ఎటువంటి అవకతవకలు జరగకుండా ప్రశ్నపత్రాలకు భద్రతా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నారపరెడ్డి శ్రీనివాసరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి


హుజూర్‌నగర్ : ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు


కోదాడలో దీక్ష చేస్తున్న బీజేపీ నాయకులు

హుజూర్‌నగర్ : టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని బీజేపీ హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ వేముల శేఖర్‌రెడ్డి కోరారు. ఈమేరకు సోమవారం హుజూర్‌నగర్‌లోని ఆర్డీఓ కార్యాలయం వద్ద బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ఆర్డీఓ వెంకారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పడిన 2014 నుంచి నేటివరకు ఎన్ని పేపర్లు లీకైనాయో వాటిపై సీబీఐతో విచారణ జరపాలని కోరారు. రద్దయిన పరీక్షల వల్ల నష్టపోయిన వారికి ఒక్కొక్కరి రూ.1 లక్ష చొప్పున పరిహారం చెల్లించాలన్నారు. లీకేజీ కారకులైన మంత్రులు కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రూరల్ అధ్యక్షుడు కుందూరు కోటిరెడ్డి, నాయకులు ఎం.చంద్రారెడ్డి, డి.యల్లయ్య, డి.రామరాజు, జి.గోపి, ఎం.వెంకటేశ్వర్లు, ఉమామహేశ్వరరావు, సోమయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీపై బీజేపీ నిరసన దీక్ష

కోదాడఅర్బన్ : టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీపై కోదాడలోని రంగా థియేటర్ చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కోదాడ అసెంబ్లీ కన్వీనర్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలేశాడని ఆరోపించారు. టీఎస్‌పీఎస్సీ నిర్వహిస్తున్న అన్ని పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలను పరీక్ష తేదీ కంటే ముందుగానే లీకు చేసి ఏళ్ల తరబడి పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థుల జీవితాలపై పిడుగుపడినట్లు చేశారన్నారు. ప్రభుత్వం స్పందించి ప్రశ్నాపత్రం లీకు చేసిన అసలు దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీని పూర్తిగా రద్దు చేసి న్యాయ విచారణ చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కిరాజు యశ్వంత్, ఓబీసీ అధికార ప్రతినిధి బి.కృష్ణయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు వి.పురుషోత్తం, చిట్టిబాబు, సత్యనారాయణ, నూనె సులోచన, పుల్లారావు, గోపాల కృష్ణ, చలిగంటి ప్రమీల, పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి తీర్మానాలు


లాలితండా గ్రామ సభకు హాజరైన గిరిజనులు

మఠంపల్లి : మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనుల ఆమోదానికై సోమవారం ఆయా గ్రామాల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా లాలితండా, చౌటపల్లి, గుండ్లపల్లి, దొనబండతండా, అల్లీపురం, తుమ్మలతండా, గుర్రంబోడుతండా తదితర గ్రామాలలో గ్రామసభలు నిర్వహించారు. ఎంపీడీఓ జానకిరాములు, ఎంపీఓ ఆంజనేయులు గ్రామ సభలను పర్యవేక్షించి మాట్లాడారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కల్పించుట, భూమి అభివృద్ధి పనులు చేపట్టుట, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్తలు చేపట్టేలా తీర్మాణాలు ఆమెదించడం జరిగిందన్నారు. ఆయా సమావేశాలలో సర్పంచ్‌లు బోడి రమేష్, కృష్ణవేణినరేష్, సుదర్శన్, పాండునాయక్, కోళ్లపూడి జోజి, టీక్యా పార్వతి, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, నరేందర్ రెడ్డి, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


గానుగబండలో వర్షానికి నేలవాలిన వరి పొలాలను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

గరిడేపల్లి : గత ఐదు రోజుల పాటు కురిసిన వర్షాలకు నేలమట్టమయిన పంట పొలాలను సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో సీపీఐ ఆధ్వర్యంలో పరిశీలించారు. రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు మాట్లాడారు. అకాల వర్షాలకు పొట్ట దశకొచ్చిన పంట నేలకొరగడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. అధికారులు పంట నష్టాలపై సమగ్ర విచారణ జరిపి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కడియాల అప్పయ్య, జొన్నలగడ్డ తిరుపతయ్య, వెంకటేశ్వర్లు, చింతలచెరువు పుల్లయ్య, నందిపాటి కాశయ్య తదితరులు ఉన్నారు.

సీనియర్ ఆర్‌ఎంపీ మృతి

చిలుకూరు : మండలంలోని ఆచార్యులగూడెం గ్రామానికి చెందిన సీనియర్ ఆర్‌ఎంపీ వెంకటేశ్వర్లు సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన గత 30 ఏళ్లుగా ఆచార్యులగూడెం, చెన్నారిగూడెం గ్రామాల్లో ఎంతో మంది రోగులకు వైద్యం చేశారు. ఆయన మృతి పట్ల బీఆర్‌ఎస్ పార్టీ కోదాడ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ కె.శశిధర్‌రెడ్డి, ఎంపీపీ బండ్ల ప్రశాంతికోటయ్య, జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీషానాగేంద్రబాబు, సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఉప సర్పంచ్ నర్సిరెడ్డి, వార్డు సభ్యులు, వివిధ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు.

ఉద్యోగాలకు 44 మంది విద్యార్థులు ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినులతో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు

కోదాడఅర్బన్ : కోదాడలోని కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థినులు 44 మంది హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థ అయిన కోడ్ వర్క్స్‌లో క్యాంపస్ సెలక్షన్ ద్వారా నియామకం అయినట్లు కళాశాల చైర్మన్ నీలా సత్యనారాయణ తెలిపారు. సోమవారం నియామకం అయిన విద్యార్థులను అభినందించి, ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. అలాగే కళాశాల సలహాదారు పి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, కళాశాల అకడమిక్ డైరెక్టర్ నాగార్జునరావు, ఏఓ కృష్ణారావులు విద్యార్థులను అభినందించారు.

కంటి వెలుగు పథకం దేశానికే ఆదర్శం

మోతె : కంటి వెలుగు పథకం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని గోల్‌తండా సర్పంచ్ శంకర్‌నాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలో గోల్‌తండాలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రాంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మోతె మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సైదులు, పర్వీనా, ఆశ వర్కర్లు, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

కోదండరాంపురంలో 'కంటి వెలుగు'

గరిడేపల్లి : మండలంలోని కోదండరాంపురం గ్రామంలో సోమవారం కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం సర్పంచ్ వెన్న రవీందర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. డాక్టర్ సంతోష్‌కుమార్, ఉపసర్పంచ్ మచ్చ రమేష్, మాజీ సర్పంచ్ రవీంద్రారెడ్డి, కార్యదర్శి వినోద్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ సుధాకర్, ఆశ వర్కర్ లక్ష్మి, కోఆప్షన్ సభ్యులు భిక్షం, వార్డుసభ్యులు నాగమణి, వీరబాబు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి తెల్లబెల్లిలో..

నడిగూడెం : మండల పరిధిలోని తెల్లబెల్లిలో మంగళవారం నుంచి రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించనున్నట్లు త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్.లక్ష్మీప్రసన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గోల్డ్‌లోన్ ప్లాజా ఎంతో ఉపయోగకరం

మునగాల: కెనరా బ్యాంకుల్లో ఏర్పాటు చేస్తున్న గోల్డ్ లోన్ ప్లాజా.. ఖాతా దారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వరంగల్ -1 రీజనల్ మేనేజర్ సీవీ రాంబాబు అన్నారు. మునగాల కెనరా బ్యాంక్‌శాఖలో గోల్డ్‌లోన్ ప్లాజా ప్రత్యేక విభాగాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. బ్యాంకులో బంగారంపై రుణాలను వేగవంతంగా అందించేందుకు ఈ ప్రత్యేక విభాగం దోహదపడుతుందన్నారు. ముందస్తు చెల్లింపు చార్జీలు ఉండవని, ఒకవేళ బ్యాంకులో ఖాతా లేనివారికి వెంటనే ఖాతా ప్రారంభించి కేవలం 20నిమిషాల వ్యవధిలోనే రుణం అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక బ్యాంక్ శాఖ మేనేజర్ నాతాల మధుసూదన్ రెడ్డి, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

పద్మక్కకు మహిళా శక్తి పురస్కారం


మహిళా శక్తి పురస్కారం అందుకుంటున్న పద్మక్క

మోతె : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్‌లో వినిశెట్టి ఈశ్వరయ్య స్మారక సేవా సమితి ఆధ్వర్యంలో మండలానికి చెందిన మహిళా టైలర్ పద్మక్కకు ఆదివారం మహిళా శక్తి పురస్కారాన్ని సేవా సమితి అధ్యక్షుడు రవీందర్ కుమార్ అందజేశారు. కార్యక్రమంలో అంజనీదేవి, మాతా సేవా ట్రస్టు చైర్మన్ డాక్టర్ శంకర్‌నారాయణ, సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దహన సంస్కారాలకు సాయం

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన తుమ్మల పుల్లమ్మ, కట్ల గుర్వయ్య అనారోగ్యానికి గురై సోమవారం మృతి చెందారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు పందిరి నాగిరెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించి పందిరి ఫౌండేషన్ తరుపున మృతుల దహన సంస్కారాలకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. శ్రీనివాసరావు, జలందర్ ఉన్నారు.